# కుండ నీళ్లు.. ఆరోగ్యానికి మేలు

- జోరుగా రంజన్లు, కుండల కొనుగోళ్లు
- ఫ్రిజ్ ఉన్నా రంజన్ల వైపే మొగ్గు
- ఎండలు దంచి కొట్టడంతో ఆసక్తి చూపుతున్న ప్రజలు



ర్యాక్‌లో భద్రపర్చిన కుండలు



రామయంపేటలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న మట్టి కుండలు, రంజన్లు

రామాయంపేట, ఫిబ్రవరి 23: అప్పుడే ఎండలు దంచి కొడుతున్నాయి. వేడితో చెమటలు పట్టడంతో చల్లని నీరు తాగితే ఎండవేడిమికి ఉపశమనం కలుగుతుంది. అందరికీ చల్లని నీటిని అందించేందుకు మార్కెట్‌లో రంజన్లు, కుండలు రెడీగా ఉన్నాయి. నిరుపేద కుటుంబాలకు రంజన్లు, మట్టికుండలే ఫ్రిజ్‌లు. వేసవి ప్రారంభమయ్యిందంటే వీటికి భలే గిరాకీ ఉంటుంది. ఇంట్లో ఫ్రిజ్ ఉన్నా కుండలో నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిదని చాలా మంది రంజన్లు కొంటున్నారు. మెదక్ జిల్లాలోని తూప్రాన్, రామాయంపేట, చేగుంట, నార్సింగి, నిజాంపేట, మనోహరాబాద్ తదితర మండలాల్లో రంజన్లు, మట్టికుండలను విరివిగా విక్రయిస్తున్నారు. గతంలో మార్చిలో ఎండలు ముదిరేవి. ప్రస్తుతం ఫిబ్రవరి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. రాత్రంతా చల్లగా ఉన్నా, పొద్దంతా ఎండవేడిమితో జనాలు విలవిలలాడుతున్నారు. రామాయంపేటలో కుండలు, రంజన్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో రంజన్‌కు రూ.100 నుంచి రూ.250 వరకు ధర పలుకుతున్నది. రజన్లకు నల్లా బిగిస్తే మరో రూ.50 అదనంగా తీసుకున్నారు. మున్ముందు ఎండలు ముదిరే అవకాశం ఉన్నదని ముందస్తుగానే వినియోగదారులు రంజన్లు, కుండలు కొనుక్కుంటున్నారు.

**విక్రయాలు బాగానే ఉన్నాయి.**



ఈ ఏడు ముందుగానే ఎండలు అధికంగా ఉన్నాయి. దీంతో రంజన్ల గిరాకీ కూడా పెరిగింది. రామాయంపేట చుట్టుపక్కల ప్రాంతాల వారు రంజన్లు కొంటున్నరు. ఫ్రిజ్‌ల నీరు తాగితే అనారోగ్యం వస్తుందనే భయంతో మరి కొంతమంది రంజన్లు కొంటున్నరు. మా దగ్గర రంజన్లు, కుండలకు నల్లాలు బిగించి ఇస్తున్నం. ఇప్పటివరకు వ్యాపారం బాగా సాగుతున్నది.

**- ఎండీ బాబా, దుకాణాదారుడు, రామాయంపేట**

## శివరాత్రికి కొప్పోల్ ఆలయం ముస్తాబు





కొప్పోల్ ఆలయంలోని స్వయంభు లింగం

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 23: దక్షిణ కాశీగా పేరుగాంచిన కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయంలో ఈనెల 25 నుంచి మహా శివ రాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25న రుత్విక్ వరణం, హోమం, 26న రుద్రాభిషేకం, 27న ఉమా సంగమేశ్వరుడి కల్యాణోత్సవం, 28న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు తెలిపారు. పెద్దశంకరంపేట నుంచి కొప్పోల్ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా కొప్పోల్‌లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట ఎస్ఐ శంకర్ తెలిపారు.

## రాజులగుట్టలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



రాజులగుట్టలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 23: పెద్దశంకరంపేట మండలంలోని గొట్టిముక్కుల రాజులగుట్టపై ఏర్పాటు చేసిన శివాలయం ప్రారంభోత్సవంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాజుల గుట్ట ఆత్మలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయన కూతురు శ్రేయారెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు దత్తు, రమేశ్, మాణిక్‌రెడ్డి, సుభాష్, యాదూల్, సూర్యప్రకాశ్, గంగారాం, కోనం అంజయ్య, బోండ్ల సంగయ్య, కిషన్, రాజు గౌడ్, ప్రవీణ్, వెంకయ్య, తదితరులున్నారు.

## చదువుతో పాటు సంస్కారం అలవర్చుకోవాలి



వేదికపై ప్రముఖులు

రామాయంపేట, ఫిబ్రవరి 23: చదువుతో పాటు సంస్కారం, ఆరోగ్యం కూడా జీవితంలో ఒక భాగమని డాక్టర్ గురువారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి, వివేకానంద వ్యవస్థాపకుడు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం వివేకానంద ఆవాస విద్యాలయ 19 వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో నిరుపేద విద్యార్థులకే చదువుకునేందుకు చోటు దక్కుతుందన్నారు. ఆవాసంలో చదివిన విద్యార్థులే నేడు సమాజంలో పేరు ప్రఖ్యాతులు గడిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థుల కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుందూరు విద్యాన్‌రెడ్డి, పడకంటి సంగమేశ్వర్, ఏలూరి పండరినాథ్, శీలం మల్లారెడ్డి, కైరంకొండ తిరుపతి, నవాత్ కిరన్, నందు జనార్దన్‌రెడ్డి, పొడేండ్ల లక్ష్మన్ యాదవ్, నక్క భిక్షపతి, యెర్రం ముత్యాలు, ఏలూరి రవీందర్, రఘుపతిగౌడ్, నవాత్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు వివాహ శుభాకాంక్షలు



పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రామాయంపేట, ఫిబ్రవరి 23: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులకు బీఆర్‌ఎస్ యువత నా యకులు పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని పద్మాదేవేందర్‌రెడ్డి దంపతుల స్వగృహానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే పద్మ, ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో యువత నాయకులు ఎస్‌కే హైమద్, అస్నోద్దీన్, ఉమామహేశ్వర్, నీల రాజు, పొల్కం నాగార్జున, శ్రీకాంత్ సాగర్, శ్రావణ్‌గౌడ్ ఉన్నారు.

## చేపలు పట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న బచ్చురాజ్‌పల్లి మత్స్యకారులు

నిజాంపేట, ఫిబ్రవరి 23: చెరువులో అక్రమంగా చేపలు పట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బచ్చురాజ్‌పల్లి మత్స్యకారులు (ముదిరాజ్) ఆదివారం ఎస్సై శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బచ్చురాజ్‌పల్లి మత్స్య సొసైటీ పరిధిలోని జెడ్‌చెర్వు తండాలో చెరువు ఉందని, తండాకు చెందిన రమావత్ రాజు, రమావత్ రామోజీ, రమావత్ శ్రీనివాస్ వలలు వేసి చేపలు పట్టారని తెలిపారు. తమ జీవనోపాధికి గండి కొడుతుండడంతో వారిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుదారుల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్, బచ్చురాజుపల్లి మత్స్యకారులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రామాయంపేట మండలం దామరచెర్వు గ్రామానికి చెందిన నవీన్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందాడు. ఆదివారం బాధిత కుటుంబానికి సంఘ సేవకుడు మోహన్ నాయక్ రూ.5 వేలు, 25 కిలోల బియ్యం అందజేశారు.

### సర్వేయర్‌పై దాడి.. వ్యక్తిపై కేసు నమోదు

శివ్వంపేట, ఫిబ్రవరి 23: ప్రైవేట్ సర్వేయర్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన గడ్డం నివేదితరెడ్డి, శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి గ్రామ శివారులో 4.15 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అందులో ఏడేండ్లుగా పంటలు పండిస్తున్నది. తమకు భూమి తక్కువగా వస్తున్నదని ఓ ప్రైవేట్ సర్వేయర్ బొడ్డు రమేశ్‌తో సర్వే చేయిస్తుండగా, పక్క భూమి యజమాని శంకర్‌తండాకు చెందిన కెతావత్ రాజు తమకు తెలియకుండా ఎందుకు సర్వే చేస్తున్నారని ప్రైవేట్ సర్వేయర్ బొడ్డు రమేశ్‌పై దాడిచేశాడు. ఈ విషయమై భూయజమాని నివేదితారెడ్డి ఫిర్యాదు మేరకు కెతావత్‌రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### యాసంగిలో 42వేల మెట్రిక్ టన్నుల ధాన్యం

రామాయంపేట, ఫిబ్రవరి 23: మండల వ్యాప్తంగా యాసంగిలో 42 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నదని ఏడీఏ డివిజన్ ఇన్‌చారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా యాసంగిలో మొత్తం రైతులు 12 వేల ఎకరాల్లో వరి వేశారన్నారు. పంటలు రోగాలకు గురైతే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

### సజావుగా గురుకుల పరీక్షలు

నర్సాపూర్, ఫిబ్రవరి 23: నర్సాపూర్‌లో గురుకుల ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్షలు సజావుగా ముగిశాయి. పరీక్షా కేంద్రాలను ఎంఈవో తారాసింగ్ తనిఖీ చేశారు. నాలుగు కేంద్రాల్లో 1191 మంది విద్యార్థులకు 1155 మంది హాజరయ్యారని తెలిపారు.

### పూరి గుడిసె దగ్ధం



పూరి గుడిసె వద్ద బాధితుడు ప్రభాకర్

శివ్వంపేట, ఫిబ్రవరి 23: పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని లింగోజిగూడలో జరిగింది. పూరి గుడిసెలో ఇద్దరు పిల్లలతో ఎర్రోళ్ల ప్రభాకర్ దంపతులు, నివసిస్తున్నారు. నాలుగురోజుల క్రితం ప్రభాకర్ భార్య అనారోగ్యానికి గురైంది. దీంతో నర్సాపూర్‌లో ఉంటూ చికిత్స చేయిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గుడిసెకు నిప్పంటుకున్నదని తెలియడంతో వెంటనే ప్రభాకర్ ఇంటికి చేరుకున్నాడు. గుడిసె పూర్తిగా కాలి బూడిదైంది. గుడిసెలో తుల బంగారం, భార్యాభర్తల పట్టా పాసుబుక్కులు, రెండు క్వింటాళ్ల బియ్యం, వంటసామగ్రి కాలిపోయింది. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

### తపాలా ఉద్యోగి మృతి.. ఆర్థిక సాయం



నిజాంపేట, ఫిబ్రవరి 23: కల్వకుంట గ్రామానికి చెందిన తపాల ఉద్యోగి బురాని యాదగిరి కొంత కాలంగా కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమం లో తీవ్ర అస్వస్థతకు గురై యాదగిరి ఆదివారం మృతి చెందాడు. మృతుడు నార్లాపూర్ బ్రాంచ్ పోస్టుమాన్ (బీపీఎం)గా వి ధులు నిర్వహించాడు. యాదగిరి మృతిపై తోటి ఉద్యోగులు తక్షణ సాయంగా అంత్యక్రియలకు రూ.10 వేలు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.



క్యూలైన్‌లో భక్తుల సందడి  పూజలు అందుకుంటున్న దుర్గామాత

## ఏడుపాయల్లో భక్తుల సందడి

పాపన్నపేట, ఫిబ్రవరి 23: ఏడుపాయల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. భక్తులు ఏడుపాయలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, రాజు, వర్ణాచారి తదితరులు ఏర్పాట్లు చేశారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్. తన సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.

## యథేచ్ఛగా ఫుట్‌పాత్ ఆక్రమణ



ఫుట్‌పాత్‌పై హార్డ్‌వేర్ సామగ్రిని ఉంచిన దుకాణదారుడు

నర్సాపూర్, ఫిబ్రవరి 23: ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని యథేచ్ఛగా హార్డ్‌వేర్ సామగ్రిని ఇష్టారీతిగా పెట్టుకున్నాడు ఓ దుకాణదారుడు. నర్సాపూ ర్ బస్టాండ్ సమీపంలోని మణికంఠ హార్డ్‌వేర్ దుకాణదారుడు దుకాణం ముందున్న ఫుట్‌పాత్‌ను ఇష్టం వచ్చినట్లు వాడుకుంటున్నాడు. దీంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తాను విక్రయించాల్సిన హార్డ్‌వేర్ సామగ్రిని ఫుట్‌పాత్‌పై ఉంచుతున్నాడు. ఫుట్‌పాత్‌పై ఉన్న సామగ్రిని తొలిగించాలని ఎన్నిసార్లు చెప్పినా దుకాణదారుడు పెడచెవిన పెడుతున్నాడని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి సామగ్రిని అక్కడ ఉంచినా మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఫుట్‌పాత్‌పై హార్డ్‌వేర్ సామగ్రిని తొలిగించి పాదచారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

## డంపింగ్ యార్డు హఠావో నర్సాపూర్ బచావో



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ప్రజలు

నర్సాపూర్, ఫిబ్రవరి 23: డంపింగ్ యార్డు హఠావో నర్సాపూర్ బచావో అంటూ డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం ఏడో రోజుకు చేరింది. నర్సాపూర్ మున్సిపాలిటీలోని 8వ వార్డుకు చెందిన ప్రజలు, రైతులు ఆదివారం రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. డంపింగ్ యార్డుతో నీరు, గాలి కాలుష్యం అవుతాయని, దీంతో భవిష్యత్తు తరాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు. కార్యక్రమంలో పట్టణ వాసులు సత్యంగౌడ్, భిక్షపతి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు  దైవ సందేశం చేస్తున్న ప్రెసిబేటరీ ఇంచార్జి శాంతయ్య

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23: మెదక్ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులనుద్దేశించి చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశం వినిపించారు. పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులను ఆశీర్వదించారు. సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, సువన్‌డగ్లస్, సంశాన్ సందీప్, నోబుల్‌సన్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు



మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి అకిరెడ్డి రాజిరెడ్డి విమర్శించారు. మార్చి 22న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించే దళిత హక్కుల పోరాట సమితి మూడో మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. జిల్లాలో ఇప్పటికీ కులవివక్ష, అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు కేటాయించిన నిధులు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాల్లో దళితులకు ప్రత్యేక వాటా కేటాయించాలన్నారు. జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంగమేశ్వర్, సంతోషి, లక్ష్మణ్, గౌతమ్, దశరత్ పాల్గొన్నారు.

## టీచర్ల గొంతుకగా పనిచేస్తా: సుధాకర్‌రెడ్డి



మెదక్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయులు ఆశీర్వదించి శాసనమండలికి పంపిస్తే వారి గొంతుకగా పనిచేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మామిడి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో పోటీ చేస్తే మూడో స్థానంలో నిలిచానని, ఈసారి ఆశీర్వదించాలని కోరారు. తనను గెలిపిస్తే ఆరు నెలల్లో మహిళా టీచర్లందరికీ ఉచితంగా ఎలక్ట్రిక్ వెహికిల్స్ అందజేస్తానన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌కు కామన్ విధానం వర్తింపజేయాలన్నారు. పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. ఎమ్మెల్సీగా గెలిస్తే ఏం చేస్తానో బాండ్ పేపర్ రాసిస్తున్నట్లు తెలిపారు. నవీన్, సాయిచరణ్ ఉన్నారు.

